ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కాకినాడ
జిల్లా వార్తలు
గురువారం 12 సెప్టెంబరు 2024 | 5



పెద్దాపురం మండలం దివిలిలో చంద్రబాబు అభివాదం

అండగా ఉంటా.. ఆదుకుంటా!



రాజుపాలెంలో చంద్రబాబుతో మాట్లాడుతున్న ముంపు బాధిత మహిళ

- ఏలేరు వరద బాధితుల్లో ధైర్యం నింపిన సీఎం చంద్రబాబు
- బాధితులందరినీ అన్ని విధాలా ఆదుకుంటామని ప్రకటన
- రాజుపాలెం గ్రామానికి ఎక్స్‌కవేటర్‌పై వెళ్లి పలకరించిన సీఎం
- ముంపులో చిక్కుకున్న పెంకుటిళ్ల లోపలకు వెళ్లి బాధితులకు భరోసా
- ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు, దుస్తులు ఇవ్వనున్నట్టు వెల్లడి
- కుళ్లిన వరి కంకులను చంద్రబాబుకు చూపించి రైతుల ఆవేదన
- ఏలేరు ఆధునికీకరణ పూర్తి చేసే బాధ్యత ఎన్డీయేదేనని ప్రకటన
- వడ్లమూరులో రైతు ఇచ్చిన కొబ్బరి బొండం తాగిన చంద్రబాబు
- దివిలి వద్ద విద్యార్థులతో మాటామంతీ.. రాజుపాలెం వద్ద రైతులతో..
- సామర్లకోటలో దిగి.. అక్కడ నుంచి వెళ్లి ఏలేరు కాలువ పరిశీలన





కిర్లంపూడి మండలం రాజుపాలెం గ్రామంలో ముంపు ప్రాంతాలను ఎక్స్‌కవేటర్‌లో వెళ్లి పరిశీలిస్తున్న చంద్రబాబు.. నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం



రాజుపాలెంలో ఏలేరు కాలువను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు





పెద్దాపురం మండలం వడ్లమూరులో ఏలేరు కాలువ పరిశీలిస్తున్న చంద్రబాబు.. వరదకు దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న సీఎం

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/పెద్దాపురం/కిర్లంపూడి/సామర్లకోట, సెప్టెంబరు11: 'ఏలేరు వరద బాధితులకు అండగా ఉంటా. ప్రతి ఒక్కరు ధైర్యంగా ఉండాలి. ప్రతి వరద బాధిత కుటుంబానికి రూ.10వేలు సాయం చేస్తా.తక్షణం దుస్తులు పంపిణీ చేయిస్తా. పంటలు నష్టపోయిన అన్నదాతలకు హెక్టారుకు రూ.25వేల సాయం, ఎరువులు, పొటాషియం అందిస్తా. ఇళ్లు దెబ్బతిన్న వారికి ఇళ్లు కట్టిస్తాను' అని సీఎం చంద్రబాబు ధైర్యం చెప్పారు. ప్రతిఒక్కరికీ సాధ్యమైనంత వేగంగా సాయం పంపిణీ చేయిస్తామని వివరించారు. ఏలేరు వరద బాధిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు బుధవారం పర్యటించారు. మధ్యాహ్నం 1.53 గంటలకు సామర్లకోట జూనియర్ కాలేజీ మైదానంలో హెలీకాప్టర్‌లో దిగారు. అక్కడ నేతలతో కాసేపు ముచ్చటించారు. అనంతరం నేరుగా కిర్లంపూడి మండలం రాజుపాలెం వరద ముంపు గ్రామం పరిశీలనకు వెళ్లారు. మార్గమధ్యలో బస్సు దిగి పెద్దాపురం మండలం వడ్లమూరు బ్రిడ్జిపై నుంచి ఏలేరు వరదను పరిశీలించారు. వరద తమ పొలాలను ఏవిధంగా ముంచేసిందో కొందరు రైతులు చంద్రబాబుకు వివరించారు. అనంతరం దివిలి సెంటర్‌లో బీఎస్సార్ కాలేజీ విద్యార్థులు సీఎం కోసం వేచి చూడగా వీరిని చూసి సీఎం బస్సు దిగారు. వారితో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా కాలేజీ విద్యార్థులు రూ.లక్ష చెక్కును ఏలేరు వరద బాధితుల సహాయం కోసం అందించారు. అక్కడి నుంచి సీఎం రాజుపాలెం గ్రామానికి చేరుకున్నారు. అప్పటికీ గ్రామంలో ఛాతివరకు వరద నీరు ప్రవహిస్తోంది. ఏలేరుకు గండిపడడంతో పూర్తిగా వరద ముంపులో చిక్కుకున్న గ్రామానికి సీఎం సాహసం చేసి ఎక్స్‌కవేటర్‌పైకి ఎక్కారు. పక్కనే ఏలేరు వరద ఉధృతి కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. ఎన్ని ఎకరాల మేర పంటలు మునిగాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత వరద ముంపులో చిక్కుకున్న ఇళ్ల వద్దకు మోకాల్లోతు నీటిలోకి దిగి వెళ్లారు. తొలుత కాకాడ వసంతరావు ఇంటికి వెళ్లారు. ముంపుతో ఏ విధంగా నష్టపోయామో బాధితులు సీఎంకు వివరించగా పక్కనే ఉన్న కలెక్టర్‌ను పిలిచి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆదేశించారు. ఆ తర్వాత వినకోటి కోటేశ్వరరావు, గణేశుల బాబురావు, చక్రవర్తుల సత్యన్నారాయణమ్మ, కేలంగి వెంకటలక్ష్మి, స్థానిక ఎస్సీ పేటకు చెందిన వికలాంగుడు దెయ్యాల నాగు తదితర కుటుంబాలతో చంద్రబాబు మాట్లాడారు. వరదకు ఇళ్ల ముంపుతో నష్టపోయిన తీరును చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. భూపాలపట్నంలో ఏలేరు కాలువలో పడి వ్యక్తి మృతిచెందడంతో ఆ విషయం తెలుసుకున్న చంద్రబాబు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం అక్కడి నుంచి సీఎం రాజుపాలెం పంచాయతీకి చేరుకుని బాధితులకు నిత్యావసర సరుకులు అందించారు. కిర్లంపూడి, పెద్దాపురం మండలాల్లోని వరద ముంపు ప్రాంతాలను సందర్శించిన అనంతరం సీఎం చంద్రబాబు సామర్లకోట చేరుకుని జిల్లా ఉన్నతాధికారులతోను, ప్రజాప్రతినిధులతోను సమీక్షిస్తారని ముందుగా అధికారులు ప్రకటించారు. అందుకు అనుగుణంగా బుధవారం మధ్యాహ్నం సామర్లకోట టీటీడీసీ ఆవరణలో వరద ప్రాంతాల ఛాయా చిత్రప్రదర్శన ఏర్పాటు చేశారు. కిర్లంపూడి మండలం రాజుపాలెంలో బాధిత రైతులతో మమేకమైన సీఎం అక్కడ అధిక సమయం ఉండడంతో అప్పటికప్పుడు సామర్లకోటలోని కార్యక్రమం రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో అక్కడే ఉన్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మీ సత్యనారాయణమూర్తిలు హెలీపాడ్ వద్దకు సీఎంకు వీడ్కోలు పలికేందుకు తరలివెళ్లారు.

ఏలేరు ఆధునికీకరణ బాధ్యత ఎన్డీయేదే..

ఏలేరు కాలువ ఆధునికీకరణ బాధ్యత పూర్తి బాధ్యత ఎన్డీయేదే అని చంద్రబాబు పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రజలు కష్టాలు వచ్చాయన్నారు. ఏలేరు రిజర్వాయర్‌కు ఒకేసారి 47వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చిందని, కిందకు వదలకపోతే ప్రాజెక్టుకు ప్రమాదం కావడంతో వరద వదలారన్నారు. దీంతో పలు ప్రాంతాలు నీట మునిగాయన్నారు. వరదల కారణంగా జిల్లాలో 65 వేల ఎకరాలు పంట పొలాలు దెబ్బతిన్నాయన్నారు. ఏలేరు వరదపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఎప్పటికప్పుడు సమీక్షలు చేస్తున్నారన్నారు. వరద ఏలేరు కాలువల్లో ఎలా ప్రవహిస్తోంది. గండ్లు ఎక్కడ పడే అవకాశం ఉందనే దానిపై అధికారులు డ్రోన్ల ద్వారా చూసి కలెక్టర్ సమయస్ఫూర్తితో వ్యవహరించారన్నారు. కాగా సీఎం ప్రయాణించిన బస్సులో ఎమ్మెల్యేలు ఎక్కారు. కిర్లంపూడిలో వరద ప్రభావం గురించి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చంద్రబాబుకు వివరించారు. ఏలేరు రిజర్వాయరుకు వస్తోన్న ఇన్‌ఫ్లో, కాలువలకు గండ్ల పరిస్థితిని ఎమ్మెల్యే సత్యప్రభ వివరించారు. పిఠాపురం మునిగిన తీరును ఫొటోలతో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ చంద్రబాబుకు వివరించారు. బాబు వెంట ఎమ్మెల్యేలు యనమల దివ్య, పంతం నానాజీ, దాట్ల బుచ్చిరాజు, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, చిక్కాల రామచంద్ర రావు, జ్యోతుల నవీన్‌కుమార్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, మాజీ ఎంపీటీసీ గొడే దొరబాబు, సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు ఉన్నారు.




సీఎంతో కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్



బాబుతో ఎమ్మెల్యేలు చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, మాజీ ఎమ్మెల్యే వర్మ, చిక్కాల



సీఎం చంద్రబాబుతో కరచాలనం చేస్తున్న ఎంపీ ఉదయ్



చంద్రబాబుతో ఎమ్మెల్యేలు సత్యప్రభ, దివ్య



ఏలేరు వరద ఉధృతి కారణంగా జలదిగ్బంధంలో చిక్కుకున్న పిఠాపురం మండలం గోకివాడ గ్రామం

నాలుగు మండలాల్లోని పాఠశాలలకు నేడు సెలవు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 11: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని నాలుగు మండలాల్లో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించినట్లు డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలేరు వరద నీటి ఉధృతి పెరుగుదలతో పిఠాపురం మండలం, యు.కొత్తపల్లి మండలం, గొల్లప్రోలు మండలం, కిర్లంపూడి మండలంలోని పాఠశాలలకు సెలవు ప్రకటించామన్నారు. సెలవును అమలు చేయని పాఠశాలలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

20వేల కుటుంబాలకు నిత్యావసరాలు సిద్ధం

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 11: వరదలవల్ల ముంపులో ఉన్న గ్రామాల్లో బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ సర్వం సిద్ధం చేసింది. మొత్తంగా 20వేల కుటుంబాలకు సరిపడేలా బియ్యం, కందిపప్పు, పంచదార, పామాయిల్, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు సిద్ధంగా ఉంచారు. జిల్లాలో పిఠాపురం, గొల్లప్రోలు, పెద్దాపురం, సామర్లకోట, తుని, ఏలేశ్వరం, యు.కొత్తపల్లి, కిర్లంపూడి మండలాల్లో బాధితులకు పంపిణీ చేస్తున్నారు. ముంపు కొనసాగుతు న్నందున నిత్యావసర సరుకుల కిట్లను పెంచుతామని పౌరసరఫరాల అధికారి ప్రసాద్ వెల్లడించారు. గొల్లప్రోలు మండలంలో జగనన్న కాలనీ, సూరంపేట, సామర్లకోటల్లో నిత్యావసర సరుకుల కిట్లను అందజేశామన్నారు.

ముంపు ప్రాంతాలకు ఆహారం, నిత్యావసరాలు అందించాలి

- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, సెప్టెంబరు 11: ఏలేరు, సుద్దగడ్డ, భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన ప్రాంతాల్లో వరద బాధితులకు ఆహారం, నిత్యావసర సరుకులను అందించాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచించారు. బుధవారం ఆయన జిల్లా కలెక్టరు షాన్‌మోహన్‌తో ఫోన్ మాట్లాడి వరద పరిస్థితిని సమీక్షించారు. ఏలేరు వరదలతో నష్టపోయిన రైతులకు మనోధైర్యం కల్పించాలన్నారు. ఏలేరు వరద క్రమేపీ తగ్గుముఖం పట్టిందని జిల్లా కలెక్టరు పవన్‌కు తెలియజేశారు.

ముంపులో 18,012 హెక్టార్ల పంట

- 27,561మంది రైతులకు భారీ నష్టం
- రూ.79కోట్లు నష్టంగా అంచనా
- రూ.30కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ కావాలని ప్రతిపాదనలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 11: జిల్లాలో భారీవర్షాలు, వరదల వల్ల పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అధికారులు రూపొందించిన ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లాలో 18,012 హెక్టార్లలో పంటలు ముంపులో ఉన్నాయి. దీనివల్ల 27,561 మంది రైతులు నష్టపోయారు. దీనివల్ల 33,250 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి తగ్గుతుందని అంచనా వేశారు. దీనివల్ల రూ.79.51కోట్లు ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు నివేదికలో పేర్కొన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ నిమిత్తం రూ.30 కోట్ల58లక్షలు ఇవ్వాలని ప్రభుత్వానికి పంపిన నివేదికలో పేర్కొన్నారు. ప్రధానంగా జిల్లాలో గొల్లప్రోలు, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, తుని, ఏలేశ్వరం, యు.కొత్తపల్లి, కిర్లంపూడి మండలాల్లో నష్టం జరిగినట్లు గుర్తించారు. దీనిలో వరిపంట అత్యధికంగా 17,432మంది రైతు లకు నష్టం జరిగింది. వరి పంట అత్యంత కీలక దశలో ఉండడంతో రైతన్న తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి 520 హెక్టార్లలో, మొక్కజొన్న 24 హెక్టార్లలో, మినుము 36 హెక్టార్లలో నష్టం జరిగినట్లు ప్రాథమికంగా పేర్కొన్నారు. దీనిలో చిన్న, సన్నకారు రైతులు 26,191 మంది కాగా ఇతరరైతులు 1370మంది ఉన్నారు. ఏలేరు, పంపా, తాండవ నది పరివాహక ప్రాంతాల్లో ఇంకా వరద నీటి ప్రవాహం కొనసాగడంవల్ల నష్టం పెరిగే అవకాశాలున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈప్రాథమిక అంచనా నివేదికను ప్రభుత్వానికి పంపుతున్నట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. 33శాతంలోపు నష్టం జరిగిన పంట పొలాలు వేలాది హెక్టార్లు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు గుర్తించారు. వరదనీరు ఉధృతి తగ్గితే వాటి నష్టం అంచనా కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

వరదలతో భారీగా ఆస్తినష్టం

- 143 గృహాలు దెబ్బతిన్నాయి
- 225 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసం
- అధికారులు రూపొందించిన ప్రాథమిక నివేదిక

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 11: జిల్లాలో ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదలకు పెద్దఎత్తున ఆస్తినష్టం జరిగింది. జిల్లాలో 143గృహాలు దెబ్బతిన్నాయి. దీనిలో 14 గృహాలు పూర్తిగా నీటి మునిగిపోయాయి. మిగిలిన గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీనిలో అత్యధికంగా ప్రత్తిపాడు మండలంలో 24 ఇళ్లు, యు.కొత్తపల్లి మండలంలో 23 ఇళ్లు, సామర్లకోట మండలంలో 21 ఇళ్లు ఉన్నట్లు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు. పిఠాపురం మండలంలో ఒకటి, గొల్లప్రోలులో 10, కాకినాడ రూరల్‌లో 9, కరపలో ఒకటి, పెదపూడిలో 2, కాజులూరులో 2, గండేపల్లిలో 8, పెద్దాపురంలో ఒకటి, కోటనందూరులో 3, కిర్లంపూడిలో ఒకటి, తునిలో 6, తొండంగిలో 12, రౌతులపూడిలో 7, శంఖవరంలో 12గృహాలు దెబ్బతిన్నాయి. దీంతో బాధితులు సమీపంలో ఉన్న పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్నారు. జిల్లాలో 225 కిలోమీటర్ల మేరకు రోడ్లు ధ్వంసమయ్యాయి. దీనిలో 69 కిలోమీటర్ల మేరకు రాష్ట్ర రహదారులు, 179 కిలోమీటర్ల మేర జిల్లా ప్రధాన రహదారులు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ రోడ్ల తాత్కాలిక పునరుద్ధరణ నిమిత్తం రూ.5కోట్లు, శాశ్వత నిర్మాణాల కోసం రూ.77.90కోట్లు అవసరమని నివేదికలో పేర్కొన్నారు. జిల్లాలో నీటిపారుదలశాఖలో 26 ప్రధాన నీటిపారుదల పనులు, 2,463 కిలోమీటర్ల 18 కట్టలు ధ్వంసమయ్యాయి. దీనికి రూ.61.64లక్షలు కావాలని పేర్కొన్నారు. భారీవర్షాల వల్ల వీరవరం వద్ద ఉన్న 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, సామర్లకోటలో సబ్‌స్టేషన్‌లు తాత్కాలికంగా దెబ్బతిన్నాయి. కృష్ణవరం వద్ద ఉన్న 11కేవీ ఏబీఎస్ నిర్మాణం కూలిపోయింది. జిల్లా వ్యాప్తంగా 11 విద్యుత్ స్తంభాలు, 11కేవీ కండక్టర్ దెబ్బతిన్నది. 11 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు విఫలమయ్యాయి. దీనివల్ల పవర్ సప్లయి నిలిచిపోయింది.

ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లాలో రూ.212కోట్ల నష్టం: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 11: ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదలవల్ల జిల్లాలో రూ.212 కోట్లు పంటలు, ఆస్తినష్టం జరిగినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ వెల్లడించారు. అధికారులు రూపొందించిన ప్రాథమిక అంచనా ప్రకారం ఈ నివేదిక రూపొందించామన్నారు. దీన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతు న్నామన్నారు. గొల్లప్రోలు మండలం, పిఠాపురం, సామర్లకోట, యు.కొత్తపల్లి, కిర్లంపూడి, ఏలేశ్వరం, పెద్దాపురం మండలాల్లో అధిక నష్టం జరిగిందన్నారు. వరద నీరు ఇంకా ప్రవాహం జరుగుతున్నందున నష్టం ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చిన వెంటనే బాధితులకు పంపిణీ చేస్తామన్నారు.

ఉధృతంగానే సుద్దగడ్డ

- ప్రత్తిపాడులో ముంపునీటిలోనే పొలాలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 11: ప్రత్తిపాడులో సుద్దగడ్డ వాగు ఉధృతి కొనసాగుతోంది. బుధవారం ఈ వాగు ధర్మవరం, వెల్లుర్తి గ్రామాల మధ్య వంతెన వద్ద ఉధృతంగా ప్రవహించింది. ప్రత్తిపాడులో సుద్దగడ్డ ఉధృతి కారణంగా ఇంకా వరిపంట పొలాలు నీటిముంపులోనే ఉన్నాయి. పెదశంకర్లపూడి, లంపకలోవ, ఉత్తరకంచి, పి.జగన్నాథపురం గ్రామాల్లో పంట పొలాలు చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. వర్షాలు, వరదల కారణంగా ముంపు బారినపడినపొలాల్లో నీరు తగ్గకపోవడంతో పంటలు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పెద్దిపాలెం, వేములపాలెం మధ్య సుబ్బారెడ్డి సాగర్ ఏటి కాలువ ఉధృతి తగ్గడంతో ఈ మార్గంలో రాకపోకలు పునరుద్ధరించారు. దీంతో ప్రత్తిపాడు-పిఠాపురం గ్రామాల మధ్య రవాణా యథావిధిగా కొనసాగుతోంది.

ఏలేరు వద్ద తగ్గుతున్న వరద

ఏలేశ్వరం, సెప్టెంబరు 11: ఎగువప్రాంతాల నుంచి వరద నీరు తగ్గడంతో ఏలేరు ప్రాజెక్టులో నీటినిల్వలు తగ్గుముఖం పడుతున్నాయి. ఇన్‌ఫ్లోస్ తగ్గడంతో ఔట్‌ఫ్లోస్ కూడా తగ్గాయి. బుధవారం నీటి నిల్వలు ఇలా ఉన్నాయి. రాత్రి 7 గంటలకు ఇన్‌ఫ్లోస్ 2275 క్యూసెక్కులు వస్తుండగా ఏలేరు కాలువలకు 600 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. విశాఖ అవసరాల నిమిత్తం 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో 86.56 మీటర్ల నీటిమట్టానికిగాను 85.42 మీటర్లు, నీటి నిల్వలు 24.11 టీఎంసీలకు గాను 21.80 టీఎంసీలకు చేరుకున్నాయి.



గొల్లప్రోలు పట్టణ శివారు పిప్పికాలువకు పడిన గండి నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు వరద నీరు



పిఠాపురం ఇల్లింద్రాడ సమీపంలో జాతీయరహదారిపై ఏలేరు వరద నీరు



పూర్తిగా ధ్వంసమైన ఏలేశ్వరం-అప్పనపాలెం వంతెన

వీడని ఏలేరు వరద

- పిఠాపురం నియోజకవర్గం అతలాకుతలం

కొత్తపల్లిని ముంచెత్తింది

జలదిగ్బంధంలోనే 216వ జాతీయ రహదారి



పిఠాపురం మండలం గోకివాడలో ఏలేరు వరద ఉధృతితో ఏకమైన పొలాలు, రహదారి

"ఏలేరు వరదతో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం అతలాకుతలమైంది. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి మండలాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. కాలువలకు భారీ గండ్లు పడ్డాయి. పలుచోట్ల పంట కాలువలు చిన్నాభిన్నమయ్యాయి. పంట పొలాల్లో ముంపు భారీగా పెరిగింది. ఇన్‌ఫ్లోస్ తగ్గించామని ఏలేరు ఇరిగేషన్ అధికారులు చెప్తున్నా ఉధృతి మాత్రం తగ్గలేదు."

- పిఠాపురం నియోజకవర్గం అతలాకుతలం
- కాలువలకు ఇరవై ఐదుకి పైగా గండ్లు
- పంట పొలాల్లో పెరిగిన ముంపు
- ఏలేరుకు ఇన్‌ఫ్లోస్ తగ్గినా అదే స్థాయిలో వరద ఉధృతి

వీడని ఏలేరు వరద

పిఠాపురం/గొల్లప్రోలు, సెప్టెంబరు 11: పిఠాపురం నియోజకవర్గాన్ని ఏలేరు వరద చుట్టుముట్టి జనజీవనాన్ని, పంటలను కకావికలం చేసింది. పంట పొలాలు జలాశయాలు, సముద్రాన్ని తలపిస్తున్నాయి. ఏలేరు ప్రాజెక్టు నుంచి విడుదలైన వరద నీటికి సుద్దగడ్డ వరద ఉధృతి తోడవ్వడంతో పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు రెండు మండలాల పరిధిలోని గ్రామాల్లో 21వేల ఎకరాల్లో వరి, పత్తి, కాయగూర పంటలు ముంపులో కొనసాగుతున్నాయి. పిఠాపురం, గొల్లప్రోలు బైపాస్, పట్టణాల పరిధిలోని పంట పొలాలు వరద నీటితో సముద్రాన్ని తలపిస్తున్నాయి. కొత్తపల్లి మండలాన్ని కూడా ఏలేరు వరద ముంచెత్తింది. ఇక్కడ నాలుగు వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు నీట మునిగాయి.

ఏలేరు వరద ఉధృతికి భారీగా గండ్లు పడ్డాయి. బుధవారం సాయంత్రం వరకు గొర్రిఖండి, నక్కలఖండి, పిప్పికాలువ, గొల్లప్రోలు కాలువ, పిడిందొడ్డి, ఎదురొడ్డి, బాడవ, పులిదొడ్డి, తుపాకిగడ్డ సహా పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో ఏలేరు నీరు ప్రవహించే కాలువలకు 25గండ్లు పడ్డాయి. ఇందులో పదికి పైగా గండ్లు అతి భారీగా ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. పలుచోట్ల గట్లు తెగిపోయినట్టు రైతులు తెలిపారు. కొన్నిచోట్ల గట్లు కనిపించని పరిస్థితి ఉంది. ఏలేరు, సుద్దగడ్డ వరదతో గొల్లప్రోలు పట్టణంలోని కాలనీల్లో వరద ముంపు గణనీయంగా పెరిగింది. గొల్లప్రోలులోని గాంధీనగరం, మార్కండేయపురం, రాయవరం రోడ్డు, ఎస్సీ కాలనీ, అరుంధతీయపేట, సూరంపేట, జగనన్న కాలనీ, శివాలయమాన్యం ప్రాంతాలన్నీ వరద ముంపులో చిక్కుకున్నాయి. గాంధీనగర్, రాయవరం రోడ్డు ప్రాంతాల్లో రెండున్నర, మూడు అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహిస్తోంది. సూరంపేట, జగనన్న కాలనీకి బోట్లులోనే రాకపోకలు సాగుతున్నాయి. ఒక్క గొల్లప్రోలు పట్టణంలోనే 2,500 కుటుంబాలు వరద ప్రభావానికి గురయ్యాయి. వెయ్యికి పైగా గృహాలు ముంపులో చిక్కుకున్నాయి. పిఠాపురం పట్టణంలోని రాపర్తి రోడ్డు, అగ్రహారం మెట్ట శివారు ప్రాంతాల్లోని ఇళ్లు ముంపునకు గురయ్యాయి. పట్టణంలోని కోర్టుల నుంచి ఇల్లింద్రాడ వరకు అరకిలో మీటరు మేర వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు.

కాకినాడ-కత్తిపూడి మధ్య గల 216వ జాతీయ రహదారి జలదిగ్బంధంలో చిక్కుకుంది. గొల్లప్రోలు బైపాస్ రోడ్డు, టోల్‌ప్లాజా, ఇల్లింద్రాడ, పిఠాపురం బైపాస్‌రోడ్డులో రాపర్తి జంక్షన్ వరకు సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా ఎనిమిది ప్రాంతాల్లో బుధవారం ఏలేరు వరద నీరు ప్రవహించింది. దీంతో మంగళవారం సాయంత్రం నుంచి ఈ రహదారిపై రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. రాత్రి ఎటువంటి వాహనాలు వరద నీటిలోకి వెళ్లకుండా బారికేడ్లు పెట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం వరద ఉధృతి కొనసాగడంతో సాయంత్రం వరకు వాహనాలను పోలీసులు అనుమతించలేదు. అయితే పలువురు వాహనచోదకులు ప్రమాదమని తెలిసినా వరద నీటిని దాటేందుకు ప్రయత్నం చేసి చిక్కుల్లో పడ్డారు. వాహనాలు పక్కకు లాగేయడంతో కొందరు ఇబ్బందులకు గురయ్యారు. జాతీయ రహదారిపై ప్రవాహ ఉధృతి సాయంత్రం స్వల్పంగా తగ్గుతున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం నుంచి రాకపోకలకు అనుమతి ఇచ్చారు. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రం వరకూ ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసులను పూర్తిగా రద్దు చేశారు. అనంతరం పునరుద్ధరించారు. పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించారు.



గొల్లప్రోలు గాంధీనగర్‌లో ఏలేరు వరద నీటిలో మునిగిన గృహాలు



రమణక్కపేటలో వరద నీటిలో చిక్కుకున్న దేవాలయం

కొత్తపల్లిని ముంచెత్తింది

- 4వేల ఎకరాల్లో పంటలు మునక
- 750 ఇళ్లల్లోకి వరద నీరు
- పునరావాస కేంద్రాల్లో బాధితులకు భోజనం: తహసీల్దారు

కొత్తపల్లి, సెప్టెంబరు 11: ఏలేరు రిజర్వాయర్‌లో అదనపు నీటిని కిందికి విడుదల చేయడంతో మండలంలో పలు గ్రామాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. కొండెవరం, ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట, యండపల్లి, శ్రీరాంపురం తదితర గ్రామాల్లో 4వేల ఎకరాల్లో సార్వా పంట పూర్తిగా ముంపునకు గురైంది. కొండెవరం శివారు కాశివారి పాకలులో 70, కొండెవరం శివారు ఇందిరానగర్‌లో 80, యండపల్లి శివారు తోటూరులో 30, కొత్త ఇసుకపల్లిలో జగనన్న కాలనీలో 60, నాగులాపల్లి ఎస్సీపేటలో 200, పాత ఇసుకపల్లి బీసీ కాలనీలో 140, రమణక్కపేటలో 150 ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. రమణక్కపేటలో దేవాలయ ప్రాంగణం వరద నీటితో మునిగింది. వరద ముంపునకు గురైన గ్రామాల్లో బాధితులకు స్థానికంగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వరద ఉధృతి తగ్గే వరకు బాధితులకు భోజన సదుపాయం కల్పిస్తామని తహసీల్దారు చిన్నారావు తెలిపారు.

వరద బాధితులకు భోజనం పంపిణీ చేయడానికి వెళ్లి...

నీటిలో వ్యక్తి గల్లంతు, మృతదేహం లభ్యం

కిర్లంపూడి, సెప్టెంబరు 11: ఏలేరు వరద నీటి ప్రవాహంలో గల్లంతై ఓ వ్యక్తి మృతి చెందాడు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన గొంతిన సుబ్బారావు (35) మంగళవారం రాత్రి వరద బాధితులకు భోజనం పంపిణీకి వెళ్లాడు. తిరిగి వస్తుండగా వరదనీటిలో గల్లంతయ్యాడు. రాత్రి నుంచీ వెదకగా బుధవారం ఉదయం ముంపు కాలనీలో ఓ చోట సుబ్బారావు మృతదేహం తేలియాడింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. హెచ్‌సీ ఎస్.వెంకటరమణ కేసు నమోదు చేశారు.

సూరంపేటలో వ్యక్తి మృతి

బోటులో మృతదేహం తరలింపు... వరద నీటిలో అంత్యక్రియల నిర్వహణకు అగచాట్లు



వరద నీటిలో మృతదేహాన్ని బోటులో తరలిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, సెప్టెంబరు 11: చనిపోయిన వ్యక్తికి అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకూ ఇబ్బందులు తప్పలేదు. వరద నీటిలోనే మృతదేహాన్ని తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారు సూరంపేటకు చెందిన ఇసరపు సూరిబాబు (62) బుధవారం మరణించాడు. సూరంపేట చుట్టూ ఏలేరు, సుద్దగడ్డ వరద నీరు ఉండటడతో అంతిమ సంస్కారాలు ఎలా నిర్వహించాలో తెలియక సంబంధీకులు సతమతమయ్యారు. అక్కడ ఉన్న జనసైనికులు, స్థానికులు విషయాన్ని గొల్లప్రోలు తహసీల్దారు సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి బోటు ఏర్పాటు చేశారు. వీఆర్వో పరమేశ్వరరాజు దగ్గరుండి బోటుపై మృతదేహాన్ని సూరంపేట నుంచి పట్టణంలోకి తీసుకువచ్చారు. అక్కడి నుంచి వరద నీటిని దాటి మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఉన్న శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిపారు



వరద నీటిలోనే మృతదేహాన్ని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న దృశ్యం



ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ ఎగువున వరద నీరు

ఎగువున తగ్గుతూ... ధవళేశ్వరం వద్ద పెరుగుతూ

- కాటన్ బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ
- రాత్రి 7 గంటలకు 15.10 అడుగులకు చేరిన నీటిమట్టం
- 15 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం/రాజమహేంద్రవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువున భద్రాచలం వద్ద తగ్గుముఖం పడుతూండగా ధవళేశ్వరం వద్ద మరింత పెరుగుతోంది. బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు నీటిమట్టం 13.75 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 13 లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహించింది. ఆపై క్రమంగా పెరుగుతూ నీటిమట్టం రాత్రి 7గంటలకు 15.10 అడుగులకు చేరుకోగా 15,06,089 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది. మరో 30వేల క్యూసెక్కుల వరద పెరిగి ఆపై తగ్గుదల నమోదు కావచ్చని అధికారుల అంచనా. ఎగురున భద్రాచలం వద్ద బుధవారం ఉదయానికి 50.50 అడుగుల వరకు పెరిగిన నీటిమట్టం తగ్గుముఖం పట్టి రాత్రి 7గంటలకు 48.40 అడుగులుగా నమోదైంది.

- ధవళేశ్వరం వరద ఉధృతి కారణంగా గోదావరి లంకల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రజలు ఘాట్లలో స్నానాలకు దిగకుండా పోలీసులు, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులకు 24 గంటలూ మూడు షిఫ్ట్‌ల కింద డ్యూటీలు వేశారు.
- మరోవైపు వినాయక విగ్రహాల నిమజ్జనానికి అధికారులు నిబంధనలు విధించారు. ప్రజలెవరూ విగ్రహాలను నేరుగా నిమజ్జనం చేయడానికి వీలులేదన్నారు. విగ్రహాలను రేవుల వద్ద అధికారులకు అప్పగిస్తే వారే నిమజ్జనం చేస్తారని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు.



లంక గ్రామాల ప్రజలకు రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ సమీపంలోని మున్సిపల్ కల్యాణ మండపంలో ఆశ్రయం కల్పించిన దృశ్యం

విద్యుతాఘాతంతో తాపీమేస్త్రీ మృతి

ఎటపాక, సెప్టెంబరు 11: ఎటపాకకు చెందిన తాపీమేస్త్రీ డేగల నర్సింహారావు (42) స్థానికంగా ఓ ఇంటి రెండో అంతస్తు గదికి ప్లాస్టింగ్ కోసం (పరంజీ) బుధవారం సెంట్రింగ్ కర్రలు అమర్చుతున్నాడు. ఆ సమయంలో సెంట్రింగ్ కర్ర పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ వైరును తాకడంతో విద్యుతాఘాతానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

నేటి నుంచి థర్మల్ డ్రోన్‌తో చిరుత పులి గాలింపు



దివాన్‌చెరువు, సెప్టెంబరు 11: 'చిరుత పులి జాడను గుర్తించేందుకు గురువారం నుంచి థర్మల్ డ్రోన్ వినియోగిస్తాం.... ఇందుకు ప్రత్యేక బృందం వస్తోందని తూర్పు గోదావరి జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.భరణి బుధవారం రాత్రి తెలిపారు. గత రెండు రోజులుగా సాధారణ డ్రోన్ సహాయంతో గాలించినా చిరుతపులి జాడ కనిపించలేదన్నారు. దీంతో థర్మల్ డ్రోన్ రప్పించామని చెప్పారు. దానిని ఆపరేట్ చేసేందుకు కూడా అనుభవజ్ఞులైన ఆపరేటర్లు ఇక్కడ అందుబాటులో లేకపోవడంతో వేరే ప్రాంతం నుంచి తీసుకు వస్తున్నామన్నారు. థర్మల్ డ్రోన్‌తో పగటి పూటతో పాటు రాత్రి కూడా గాలింపు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కాగా బుధవారం కూడా ట్రాప్ కెమెరాలో చిరుత పులి జాడ కనిపించలేదన్నారు. దివాన్‌చెరువు రిజర్వ్ అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచారం కోసం ట్రాప్ కెమెరాల అమరికలో మార్పులు చేసినట్టు చెప్పారు. చిరుత సంచారం బట్టి అనుమానాస్పద ప్రాంతంలో రెండు ట్రాప్ బోనులను స్థానాలు మార్చి దానిని పట్టుకునేందుకు పూర్తి ప్రయత్నం చేస్తున్నామని వివరించారు.

నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో

ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్

అన్నవరం, సెప్టెంబరు 11: అన్నవరం దత్తత దేవాలయమైన కోరుకొండ ఆలయానికి సంబంధించి వివిధ పద్దుల కింద వసూలైన నిధుల్లో సుమారు రూ.15 లక్షలు గోల్‌మాల్ అయిన వ్యవహారంలో జూనియర్ అసిస్టెంట్ కొంతం సతీష్, రికార్డ్ అసిస్టెంట్లు టి.అనిల్‌కుమార్, ఆర్.రవికుమార్‌లను బాధ్యులు చేశారు. వారు ముగ్గురినీ సస్పెండ్ చేస్తూ ఈవో రామచంద్రమోహన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారంలోపు సంజాయిషీ ఇవ్వాలని, లేకుంటే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో సూపరింటెండెంట్‌గా పనిచేసిన కిషోర్‌కుమార్, ప్రస్తుత లీజుల విభాగం సూపరింటెండెంట్ కాపారపు శివలకు పర్యవేక్షణ లోపం కారణంగా చార్జి మెమో ఇచ్చినట్టు అధికారులు తెలిపారు. వీరితో పాటు అన్నవరం దేవస్థానం నుంచి బదిలీపై వెళ్లిన ఉప కమిషనరు రమేష్‌బాబు, ఏఈవో శ్రీనివాసరావులను ఈ వ్యవహారానికి సంబంధించి దేవదాయ శాఖ కమిషనరు దృష్టిలో పెట్టి అక్కడి నుంచి వివరణ తీసుకునేలా చర్యలు తీసుకోనున్నట్టు తెలిసింది.



ఆలయానికి చేరిన పవిత్రాలను చూపిస్తున్న అర్చకులు, అధికారులు

అంతర్వేదిలో నేటి నుంచి

పవిత్రోత్సవాలు

అంతర్వేది, సెప్టెంబరు 11: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నుంచి నాలుగు రోజులు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నుంచి ప్రత్యేక పూజలు చేయించిన పవిత్రాలను అంతర్వేది తీసుకొచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ఉత్సవాలను తిలకించాలని ఆయన కోరారు.

వరద నీటిలో మునిగి రైతు మృతి



సూరిబాబు (పాత చిత్రం)

ఎటపాక, సెప్టెంబరు 11: పశువుల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు గోదావరి వరద నీటిలో మునిగి గిరిజన రైతు మృతి చెందాడు. మండలంలోని కృష్ణవరం పంచాయతీ గొందిరాజుపేట గిరిజన గ్రామానికి చెందిన రైతు కొలూరి సూరిబాబు (37) బుధవారం సాయంత్రం ఇంటి వెనుక శివారు ప్రాంతంలో మేతకు వెళ్లిన తమ బంధువుల పశువులను తోలుకొచ్చేందుకు వెళ్లాడు. గోదావరి వరదతో నిండిన గ్రావెల్ గోతిలో పడి మునిగిపోయాడు. ఎంతసేపటికీ రాకపోయేసరికి కుటుంబ సభ్యులు ఆరా తీసి వెంటనే అక్కడకు వెళ్లారు. వరద నీటిలో పడిన ఆనవాళ్లను గుర్తించారు. గాలింపు చర్యలు చేపట్టగా సూరిబాబు మృతదేహం లభ్యమైంది. సూరిబాబుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

321 మంది సీఆర్‌టీల కొనసాగింపునకు ఉత్తర్వులు

ఎమ్మెల్యే శిరీష చొరవతో స్పందించిన కమిషనరు

రంపచోడవరం, సెప్టెంబరు 11: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో కాంట్రాక్టు టీచర్లను కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం బుధవారం ఆదేశాలు జారీ చేశారని ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే శిరీషదేవి చొరవతో కమిషనరు స్పందించారు. ఆయా విద్యాలయాల్లో ఉన్న ఖాళీల ఆధారంగా 321 మంది సీఆర్‌టీలను మరో ఏడాది కొనసాగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొలిక్కిరాని సత్యదేవుడి విమాన గోపురం

స్వర్ణ తాపడం అంచనాలు

- చదరపు అడుగుకు 25 గ్రాముల బంగారమైతే 72 కిలోలు
- 5 గ్రాముల చొప్పునైతే 15 కిలోల బంగారం అవసరం

అన్నవరం, సెప్టెంబరు 11: రత్నగిరివాసుడైన సత్యదేవుడి విమాన గోపురం స్వర్ణతాపడం అంచనాలు ఇంకా కొలిక్కిరాలేదు. తిరుమల తిరుపతి దేవస్థానం బృందం సుమారు 114 కిలోల బంగారం పడుతుందని, 90 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈవో రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు రిటైర్డ్ డిప్యూటీ స్థపతి బుధవారం వచ్చి పరిశీలించారు. చుట్టూ ఉన్న నాలుగు గోపురాలు మినహాయిస్తే చదరపు అడుగుకు రాగిరేకుపై 25 గ్రాముల బంగారం వినియోగిస్తే సుమారు 72 కిలోలు అవసరం ఉంటుందని, దీనికి సుమారు రూ.60 కోట్లు వ్యయం అవుతుందని లెక్కగట్టారు. అయితే ధ్వజస్తంభానికి అడుగుకు 5 గ్రాముల బంగారం వినియోగించగా... ఆ ప్రకారం 15 కిలోల బంగారం సరిపోతుందని, రూ.15 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఈ రెండు ప్రతిపాదనలను ఈవో రామచంద్రమోహన్ దృష్టిలో పెట్టి దేవదాయ శాఖ కమిషనరు ఆదేశాల మేరకు తుది నిర్ణయం తీసుకుంటామని ఇంజనీరింగ్ అధికారులు చెప్పారు.

విద్యుదాఘాతంతో మహిళకు గాయాలు

వై.రామవరం, సెప్టెంబరు 11: మండలంలోని పసిరిగిన్ని గ్రామానికి చెందిన చోళ్ల అచ్చియ్యమ్మ మోహనాపురంలోని అత్తింటి నుంచి మంగళవారం సాయంత్రం పి.యర్రగొండలోని వదిన ఇంటికొచ్చింది. బుధవారం ఉదయం డాబాపై చీరలు ఆరేస్తుండగా 33 కేవీ విద్యుత్ వైర్లు తగిలి గాయపడింది. గాయపడిన అచ్చియ్యమ్మను వై.రామవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు శరీరం 60శాతానికి పైగా కాలడంతో కాకినాడ ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేసినట్టు వైద్యాధికారి రాహుల్ చెప్పారు..

కాకినాడ

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి హుండీ లెక్కింపు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 11: ఇంద్రపాలెంలోని మందేశ్వర సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించినట్టు ఆలయ ఈవో జోగా సత్యనారాయణ తెలిపారు. 81 రోజులకు రూ. 1,06,372 ఆదాయం వచ్చిందన్నారు. దేవదాయ, ధర్మదాయ శాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి పణేంద్రకుమార్ పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో కైకవోలు గ్రూపు దేవస్థానములు ఈవో డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో ఆందోళన చేస్తున్న ఏఐఎఫ్‌టీయూ నేతలు, ప్రజలు

'వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి'

గొల్లప్రోలు, సెప్టెంబరు 11: రాష్ట్రాన్ని 2 వారాలుగా అతలాకుతలం చేస్తున్న భారీ వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి రాష్ట్రాన్ని కేంద్రప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో గొల్లప్రోలులో బుధవారం వరద నీటిలో ఆందోళన నిర్వహించారు. చెరువులు, కాలువల్లో ఆక్రమణలు తొలగించాలని, వరద ముంపు నివారణకు శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు, డి.నారాయణమూర్తి, గుడాల చార్లెస్, కేశవరపు వీరన్న పాల్గొన్నారు.

కిర్లంపూడి: మండలంలోని గోనేడ శివారు కండి దగ్గర మునిగిపోయిన పొలాలను ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పరిశీలించి వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు. వరదల్లో ఇళ్లు కోల్పోయిన వారికి పక్కా గృహాలు కట్టించి 6 నెలల వరకు జీవనభృతి కల్పించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమేష్, డాన్ శ్రీను,కానూరి సత్తిబాబు పాల్గొన్నారు.

'చేనేత సహకార సంఘాలకు పూర్వ వైభవం'

తుని రూరల్, సెప్టెంబరు 11: చేనేత సహకార సంఘాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని మాజీ మంత్రి, రాష్ట్ర టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తుని నియోజకవర్గానికి చెందిన చేనేత సహకరా సంఘ పెద్దలు తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా యనమలను కలిశారు. నియోజకవర్గంలో చేనేత సొసైటీల పరిస్థితులు వివరించగా వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. వైసీపీ పాలనలో చేనేతలు తీవ్రంగా నష్టపోయాయని, సొసైటీలు నిర్వీర్యం అయ్యాయన్నారు. నేత అన్నలను అన్ని విధాలా ఆదుకునే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని, చేనేత సహకార సంఘ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో కార్మికులు, సభ్యులు ఏకాభిప్రాయానికి వచ్చి సంఘాల బలోపేతానికి దోహదపడలాని కోరారు.

'దాతల సేవలు అభినందనీయం'

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 11: ఏలేరు వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకొచ్చి సేవలు అందిసున్తున్న దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. బుధవారం రమణయ్యపేటలో ఎస్ఆర్ఎంటీ ప్లాట్ ఓనర్స్, షీ ఫౌండేషన్ సంస్థల ఆధ్వర్యంలో పిఠాపురం వరద బాధితులకు అందించేందుకు వీలుగా 1000 కిలోల బియ్యం, 1000 కిలోల కాయకూరలు, నిత్యావసర సరుకుల లోడు వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. పవన్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు షీ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షురాలు దివ్య తెలిపారు. కార్యక్రమంలో ప్లాట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ అబ్బాయిరెడ్డి, కూటమి నాయకులు రంబాల వెంకటేశ్వరరావు, బోళ్ల కృష్ణమోహన్ పాల్గొన్నారు.

'రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 11: భారీవర్షాల కారణంగా ఏలేరు, బిక్కవోలు డ్రైన్‌లకు పెదఎత్తున వరదనీరు చేరడంతో పెదపూడి మండలంలో 2వేల ఎకరాల పంట పొలాలు మునకలో ఉన్నాయని, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వెల్లడించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ వరద మరింత పెరిగే అవకాశం ఉందని, ఇళ్లు మునిగే ప్రమాదం ఉన్నచోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు.

నేమాం ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 11: కాకినాడ రూరల్ నేమాం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ గుత్తుల గోపీపై వచ్చిన పలు అభియోగాలపై బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో డ్వామా ఫైనాన్స్ మేనేజర్ పి.విజయభాస్కర్ విచారణ నిర్వహించారు. స్థానికుడు గుబ్బల శివ ఫీల్డ్ అసిస్టెంట్‌పై చేసిన ఫిర్యాదు మేరకు డ్వాకా పీడీ వెంకటలక్ష్మి ఆదేశాలతో క్షేత్రస్థాయిలో కూలీలతో బహిరంగ సభలో అభిప్రాయ సేకరణ విచారణ చేపట్టామన్నారు. విచారణలో వచ్చిన అంశాలను నివేదిక తయారు చేసి డ్వామా పీడీకి అంజేస్తామన్నారు. సమావేశంలో ఏపీవో గణేష్, గ్రామ సర్పంచ్ రాందేవు సూర్యప్రకాశరావు, గ్రామ కార్యదర్శి కేసవరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కరప, సెప్టెంబరు 11: నడకుదురు సబ్‌స్టేషన్ పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. నడకుదురులో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఆయన చెప్పారు.

17న కాకినాడలో డాక్ అదాలత్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 11: తపాలాశాఖ వినియోగదారుల సౌకర్యాల్లో లోపాలను పరిశీలించేందుకు ఈనెల 17న కాకినాడలోని డివిజనల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. వినియోగదారులు తపాలా, రిజిస్టర్డ్, వీపీ, బంగీలు, మనియార్డర్లు, తపాలా జీవిత బీమా, సేవింగ్స్ బ్యాంకు, స్పీడ్ పోస్ట్ సంబంధించిన ఫిర్యాదులను, సలహాలను ఈనెల13లోగా పంపాలని, కవరుపై డాక్ అదాలత్ అని తప్పనిసరిగా రాయాలన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బస్సు


తాళ్లరేవు, సెప్టెంబరు 11: కోరింగ చెట్టు వద్ద ద్విచక్రవాహనాన్ని బుధవారం ఒక ప్రైవేట్ బస్సు ఢీకొన్నట్టు స్థానికులు పోలీసులు తెలిపారు. ద్రాక్షారామకు చెందిన శీలం గోపాలకృష్ణ కోరింగ కైట్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అతడు కోరింగ నుంచి ద్విచక్రవాహనంపై తాళ్లరేవు వెళ్తుండగా కోరింగ చెట్టు వద్ద ఎదురుగా వస్తున్న రొయ్యల హెడ్‌లెస్ కంపెనీకి చెందిన ప్రవేటు బస్సు ఢీకొంది. గోపాలకృష్ణకు తలకు గాయంకాగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోరింగ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హారిక తల్లికి రూ.5 లక్షల చెక్కు అందజేత

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 11: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో ఆగస్టు 21న జరిగిన దుర్ఘటనలో మృతిచెందిన కాకినాడ రెండో డివిజన్‌కు చెందిన చల్లపల్లి హారిక తల్లి అన్నపూర్ణకు వైసీపీ అధ్యక్షులు జగన్ అందించిన రూ.5 లక్షల చెక్కును మాజీ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుత్తుల సూర్యప్రకాశ్, సూరవరపు విష్ణు, కర్రిచక్రధర్ తదితరులు ఉన్నారు.

పాము కాటుతో కౌలు రైతు మృతి

కూరాడ (కరప), సెప్టెంబరు 11: మండలంలోని కూరాడలో బుధవారం గ్రామానికి చెందిన కాకర్ల నారాయణమూర్తి (37) అనే కౌలు రైతు చేలో పురుగుమందు స్ప్రే చేస్తుండగా అతడి కాలి పాదంపై తాచుపాము కాటువేసింది. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదుతో కరప పోలీసులు కేసు నమోదుచేశారు.



మృతిచెందిన నారాయణమూర్తి

గ్రామాల్లో పెరిగిన వరద ముంపు

పిఠాపురం మండల పరిధిలో నీట మునిగిన గృహాలు

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 11: పిఠాపురం మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరద ముంపు బుధవారం భారీగా పెరిగింది. మాధవపురం, భోగాపురం ఎస్సీ, ఉప్పర కాలనీలు, బిప్రత్తిపాడు, నవఖండ్రవాడ, గోకివాడ, కోలంక తదితర గ్రామాల్లోని గృహాలు ఏలేరు వరద నీట మునిగాయి. మాధవపురంలో ముంపు గంటగంటకు అధికమవుతున్నది. దాదాపు అన్ని గ్రామాలను ఏలేరు వరద చుట్టేయడంతో రాకపోకలు స్తంభించాయి. పిఠాపురం-జములపల్లి-గోకివాడ, పిఠాపురం-రాపర్తి,జల్లూరు-సామర్లకోట, గొల్లప్రోలు-భోగాపురం రహదారులపై భారీగా ఏలేరు వరద నీరు ప్రవహిస్తుండడంతో 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ముంపు ప్రాంతాలకు ఆహార ప్యాకెట్లు పంపే ందుకు వరద నీరు అడ్డంకిగా మారడంతో స్థానికంగా వండి అందించే ఏర్పాటు చేస్తున్నామని అధికారులు తెలిపారు.



పిఠాపురం మండలం జములపల్లి రహదారిపై ఉధృతంగా వరద నీరు



సామర్లకోట టిడ్కో గృహాల వద్ద మోకాలి ఎత్తున చేరిన వరద నీరు

శివాలయంలోకి వరద నీరు

1983 తర్వాత ఇప్పుడే...

గొల్లప్రోలు, సెప్టెంబరు 11: గొల్లప్రోలు శివాలయంలోకి స్వల్పంగా ఏలేరు వరద నీరు చేరింది. 4 దశాబ్దాల తర్వాత వరద నీరు ఇందులోకి ప్రవేశించడం ఇదే ప్రథమం. ఏలేరు వరద ఉధృతికి ఇది నిదర్శనమని పలువురు వృద్ధులు తెలిపారు. పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం)లోకి ఏలేరు వరద నీరు బుధవారం తెల్లవారుజామున స్వల్పంగా ప్రవేశించింది. 1983లో ఏలేరు జలాలు 2.38లక్షల క్యూసెక్కుల విడుదల చేసినప్పుడు వచ్చిన అతి భారీ వరదల సమయంలో శివాలయం వరద నీటిలో చిక్కుకుంది. తదనంతరం అతి భారీ వర్షాలు కుంభవృష్టిగా కురిసిన 6 సందర్భాల్లో మినహా ఎప్పుడు ఆలయంలోకి నీరు ప్రవేశించలేదు. ఇప్పుడు ఏలేరు నీరు ఆలయ ప్రాంగణంలోకి రా వడంతో ఏలేరు జలాలు భారీగా విడుదల చేసి ఉంటారని పట్టణ పజలు చర్చించుకుంటున్నారు.



గొల్లప్రోలు శివాలయంలోకి చేరిన ఏలేరు వరద నీరు

పెరిగిన నీటి ప్రవాహం

సామర్లకోట: ఏలేరు మిగులు జలాలు సామర్లకోట-పిఠాపురం రోడ్డులో మోకాలి ఎత్తున వరద నీరు చేరి వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయిన విషయం విదితమే. బుధవారం వరద తీవ్రత మరింత పెరగడంతో ఐదడుగుల ఎత్తున వరద నీరు చేరడంతో రైతులు పొలాలకు వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. టిడ్కో గృహాల వద్దకు నీటి ప్రవాహం మరింత పెరగడంతో సురక్షిత ప్రాంతాలకు బాధితులను చేరవేసి ఆహార సదుపాయాలను అధికారులు కల్పించారు. కాగా వెంకటకృష్ణరాయపురం వద్ద ఏలేరు కాలువకు గండి పడే ప్రాంతాన్ని పటిష్టపరిచే పనులు బుధవారం సాయంతానికి పూర్తి చేశారు.

నిలిచిన తాగునీటి సరఫరా

ఏలేశ్వరం: ఏలేశ్వరం - అప్పనపాలెం కాజ్‌వే వంతెన దెబ్బతినడంతో పరిధిలో సాగు నీటి పైపులు పూర్తిగా ధ్వంసమై ప్రజలకు తాగునీరు సరఫరా నిలిచిపోయింది. వంతెనపై ప్రజలు రాకపోకలు నిలిచిపోవడంతో విద్యార్థులు, వ్యాపారస్తులు, రైతులకు మార్గం లేకుండాపోయింది. అధికారులు వెంటనే స్పందించి దెబ్బతిన్న అప్పనపాలెం వంతెనపై రాకపోకలకు తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అండగా ఉంటాం : ఎంపీ

పిఠాపురం/గొల్లప్రోలు, సెప్టెంబరు 11: ఏలేరు, సుద్దగడ్డ వరదల కారణంగా ముంపునకు గురై నష్టపోయిన బాధితులందరికి అండగా ఉంటామని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ తెలిపారు. పిఠాపురం బైపాస్‌రోడ్డు, రాపర్తి జంక్షన్, గొల్లప్రోలు టోల్‌గేట్ వద్ద ముంపునకు గురైన ప్రాంతాలు, పంటపొలాలను ఆయన బుధవారం సాయంత్రం పరిశీలించారు. జాతీయరహదారిపై ఏలేరు వరద ప్రవాహాన్ని పరిశీలించి పరిస్థితిపై అధికారులను ఆరా తీశారు. గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాలు, మండలాల పరిధిలో ముంపునకు గురైన కాలనీల్లో బాధితులు, ముంపు కారణంగా పంటలు నష్టపోయిన ప్రతి ఒక్కరిని ఆదుకుంటామన్నారు. బాధితులకు అన్ని విధాల సహాయం అందజేయాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. వరదలతో ఇబ్బందులు పడుతున్నామని బాధితులు, రైతులు ఎంపీకి తెలిపారు.

రైతులను ఆదుకుంటాం : రాజప్ప

పెద్దాపురం, సెప్టెంబరు 11: ఏలేరు వరదల కారణంగా దెబ్బతిన్న రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. మండలంలోని కాండ్రకోటలో బెడ్ రెగ్యులేటర్ వద్ద మంగళవారం అర్ధరాత్రి పడిన గండిని ఆయన బుధవారం పరిశీలించి రైతులతో మాట్లాడుతూ వరదల కాణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని కూటమి ప్రభుత్వ తప్పకుండా ఆదుకుంటుందన్నారు. ఇప్పటికే దబ్బకాలువపై తాత్కాలిక వంతెన కొట్టుకుపోయిందని, దానిస్థానంలో రూ.50 లక్షల వ్యయంతో మొబైల్ వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఇరిగేషన్ ఏఈ పాలెపు వీరబాబు, టీడీపీ నేతలు ఎలిశెట్టి నాని, తోట రామకృష్ణ పాల్గొన్నారు. ఏలేరు వరద బాధితులకు ఎమ్మెల్యే నిమ్మకాయల రాజప్ప నిత్యావసరాలను అందచేశారు. మండల పరిధిలోని కాండ్రకోట, మర్లావ గ్రామాల్లో సుమారు 90 కుటుంబాలకు 25 కిలోల బియ్యం, కేజీ ఉల్లిపాయలు, బంగాళదుంపలు, కందిపప్పు, నూని, పంచదార అందజేశారు. తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దివ్య పరిశీలన

తుని రూరల్, సెప్టెంబరు 11: వరద ఉధృతికి తీవ్రంగా నష్టపోయిన రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని తుని ఎమ్మెల్యే యనమల దివ్య స్పష్టం చేశారు. కోటనందూరు మండలం కె.కొట్టం వద్ద గల కొన్ని దిగువ పంటలను ఆమె పరిశీలించారు. టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజబాబు, గొర్లె అచ్చినాయుడు, అంకం రెడ్డి రమేష్, చిటికెల సత్యనారాయణ, వెలగా వెంకటకృష్ణారావు, చింతకాయల రవికుమార్ ఉన్నారు.



పంటపొలాలను పరిశీలిస్తున్న కాకినాడ ఎంపీ

తొండంగి: పెరుమాళ్లపురం, కోదాడ గ్రామాల్లో ముంపు పొలాలను తుని ఎమ్మెల్యే యనమల దివ్య పరిశీలించారు. కోన ప్రాంతం ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. సీనియర్ టీడీపీ నేతలు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతంనీడి అబ్బాయి, జిల్లా టీడీపీ మత్స్యకార సంఘం అధ్యక్షులు కోడ వెంకటరమణ, కొయ్యా రామకేశవ,చొక్కా అప్పారావు ఉన్నారు.

ముంపు పొలాల పరిశీలన

ప్రత్తిపాడు, సెప్టెంబరు 11: మండలంలో ముంపు బారిన పడిన పంట పొలాలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మడి వెంకట్రావు, సైనిక్ సెల్ కన్వీనర్ కర్రి ధర్మరాజు, నాయకులు రామ్‌కుర్తి సూర్యనారాయణ, ఊటా భాస్కరరావు, కూరాకుల రాజా, ఏలూరు సుబ్రహ్మణ్యం పరిశీలించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పెద్దాపురం: ఏలేరు ముంపు ప్రాంతాలను సీపీఎం బృందం పరిశీలించింది. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. రాజశేఖర్, మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు కాండ్రకోట, వడ్లమూరు, మర్లావ, పాతపెద్దాపురం తదితర ప్రాంతాలను పరిశీలించారు. ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎకరానికి రూ.20 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేదారి నాగు, గడిగట్ల సత్తిబాబు, సిరిపురపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వరద నీటిలో ఒరిగిపోయిన లారీ

గొల్లప్రోలు, సెప్టెంబరు 11: గొల్లప్రోలు టోల్‌గేటు సమీపంలో 216వ జాతీయ రహదారిపై వరద ఉధృతికి లారీ ఒరిగిపోయింది. పోలీసులు వాహనాల రాకపోకలను నియంత్రించినా లోడు లారీ ఒకటి పిఠాపురం నుంచి కత్తిపూడి వైపు బయలుదేరింది. టోల్‌గేటు సమీపంలో ఏలేరు వరద నీటిలో లారీ చిక్కుకుని ఒకవైపు ఒరిగిపోయింది. దానిని సాయంత్రం క్రేన్ సహాయంతో బయటకు తీసేందుకు ఎన్‌హెచ్ సిబ్బంది, పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. సుమారు గంటన్నర పాటు శ్రమించి దానిని బయటకు తీశారు.



లారీని క్రేన్‌తో బయటకు తీస్తున్న దృశ్యం

ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ పనులు ప్రారంభించాలి

సీఎం చంద్రబాబును కోరిన వర్మ



ఏలేరు, సుద్దగడ్డ వరదల కారణంగా జరిగిన నష్టాన్ని సీఎం చంద్రబాబుకు వివరిస్తున్న వర్మ

పిఠాపురం, సెప్టెంబరు 11: ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ పనులను తక్షణం ప్రారంభించి వరద ముంపు నుంచి పిఠాపురం నియోజకవర్గానికి శాశ్వత రక్షణ కల్పించాలని ముఖ్యమంత్రిని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబును సామర్లకోట నుంచి రాజుపాలెం పర్యటనకు బస్సులో వెళ్తుండగా వర్మ కలిసి వరదల కారణంగా పిఠాపురం నియోజకవర్గానికి జరిగిన నష్టాన్ని ఫోటోల సహాయంతో వివరించారు. టీడీపీ హయాంలోనే ఏలేరు ఫేజ్-2 పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ పనులు జరిగి ఉంటే నేడు వరదల కారణంగా నష్టం జరిగి ఉండేది కాదని, జగన్ ఈ పనులను రద్దు చేయడంతోనే ఇంత విలయం జరిగిందని వర్మ వివరించారు. మీ చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన పనులను తిరిగి ప్రారంభించి ముంపు నుంచి రక్షణ కల్పించాలని కోరగా చంద్రబాబు సానుకూలంగా స్పందించినట్టు వర్మ తెలిపారు.

కొత్తపల్లి: ఏలేరు వరదనీటితో పంట పొలాలు మునిగిన నాగులాపల్లి, రమణక్కపేట, ఇసుకపల్లి గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే వర్మ పర్యటించారు. ఇరిగేషన్ అధికారులతో చర్చించి ప్రభుత్వం ద్వారా రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టనున్నట్టు ధైర్యం చెప్పారు. టీడీపీ కొత్తపల్లి మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానం దరెడ్డి, రమణక్కపేట నీటి సంఘ అధ్యక్షులు పెనుమల్లు కృష్ణారెడ్డి, చంటి రాజు, సత్యనారాయణ రాజు, రైతులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 11: భారీ వర్షాలు, వరదల వల్ల ప్రత్తిపాడు నియోజకవర్గంలో భారీ పంట నష్టం జరిగిందని, రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కోరారు. కిర్లంపూడి మండలం రాజుపాలెం ముంపు ప్రాంతాల సందర్శనకు విచ్చేసిన చంద్రబాబుకు ఎమ్మెల్యే సత్యప్రభ నియోజకవర్గ పంట నష్టాల వివరాల నివేదికను అందజేశారు. నియోజకవర్గంలో 9,195 ఎకరాల వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయని.. 53 గ్రామాల రైతాంగానికి వరదల వల్ల నష్టం వాటిల్లిందని చెప్పారు. అనంతరం తేటగుంటలోని శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడిని కలిసి పంటనష్టాలను ఆమె వివరించారు.

తుని రూరల్: ముంపు ప్రాంతాలను పరిశీలించేందుకు జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును తుని ఎమ్మెల్యే యనమల దివ్య కలిసి నియోజకవర్గంలో ముంపు రైతుల సమస్యలను వివరించారు. వరద బాధితుల సహాయార్థం నియోజకవర్గానికి చెందిన డాక్టర్లు, వ్యాపారవేత్తలు సీఎం రిలీఫ్ ఫండ్‌కి ఇచ్చిన నగదు చెక్కులను చంద్రబాబుకు అందజేశారు. టీడీపీ యువ నేత యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు ఉన్నారు.

చంద్రబాబును కలిసిన పిల్లి అనంతలక్ష్మి దంపతులు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 11: ఏలేరు వరద బాధితులను పరామర్శించేందుకు సామర్లకోట విచ్చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబును మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తి దంపతులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. చంద్రబాబును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు కలిసి ఏలేరు వరద ముంపు శాశ్వత నివారణకు చర్యలు తీసుకుని రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఎమ్మెల్సీ నెల జీతం విరాళం



చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ

పెద్దాపురం, సెప్టెంబరు 11: వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ఒక నెల జీతాన్ని (రూ.1.75 లక్షలు) విరాళంగా అందించారు. ఈ మేరకు సామర్లకోటలో సీఎం చంద్రబాబును కలిసి చెక్కును ఆమె అంద చేశారు. ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన పద్మశ్రీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు చెక్కును అందచేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. చెక్కు అందచేసిన ఎమ్మెల్సీ పద్మశ్రీని సీఎం చంద్రబాబు అభినందిచారు.

రూ.లక్ష విరాళం

పెద్దాపురం మండలంలోని దివిలి గ్రామానికి చెందిన బీఎస్సార్ కళాశాల యాజమాన్యం వరద బాధితుల సహాయార్థం రూ.లక్ష చెక్కును సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. కళాశాల చైర్మన్ ఎం.చంటి, రాంబాబు ఈచెక్కును చంద్రబాబుకు దివిలి గ్రామంలో అందచేశారు. కళాశాల యాజమాన్యాన్ని చంద్రబాబు అభినందించారు.

'ఉద్యోగావకాశాన్ని కల్పించాలి'

సామర్లకోట, సెప్టెంబరు 11: కబడ్డీలో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి ఎందరో కబడ్డీ క్రీడాకారులను తీర్చిదిద్దిన తనకు గత 15ఏళ్లుగా ప్రభుత్వం ఏ ప్రోత్సాహం అందివ్వలేదని, క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగావకాశాన్ని కల్పించాలని సామర్లకోటకు చెందిన మహిళా కబడ్డీ క్రీడాకారిణి కోగంటి శ్వేత సీఎం చంద్రబాబుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. చంద్రబాబు సానుకూలంగా స్పందించి చర్యలకు కలెక్టర్‌కు శ్వేత వినతిపత్రాన్ని అందజేశారు.

నీలపల్లిలో ఆర్డీవో పరిశీలన

తాళ్లరేవు, సెప్టెంబరు 11: నీలపల్లి అయ్యన్ననగర్ లాకు తలుపులను కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ బృందం బుధవారం పరిశీలించారు. అయ్యన్ననగర్ లాక్‌గేటు నుంచి వరద నీరు నీలపల్లి గ్రామం డ్రైనేజీ ద్వారా ప్రవహించడంతో ముందస్తుగా అధికారులు చర్యలు చేపట్టారు. తహశీల్దార్ ఎమ్.సూరిబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మారుతీరావు, ఇరిగేషన్ ఎఈ ఈశ్వరరావు, ఈవోపీఆర్డీ ఎమ్.భైరవమూర్తి, ఎంపీడీవో ఎమ్.అనుపమ, కార్యదర్శి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ పరికరాల అందజేత

తాళ్లరేవు, సెప్టెంబరు 11: రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆర్థిక సహకారంతో తీరప్రాంత ప్రభుత్వ పాఠశాలలకు సైన్స్‌ల్యాబ్ పరికరాలను ఉచితంగా అందించినట్టు సీఎస్ఆర్ మేనేజర్ సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. గాడిమొగ, లక్ష్మీపతిపురం, భైరవపాలెం జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు రూ.50వేలు విలువచేసే పరికరాలను అందించారు. రిలయన్స్ హెచ్ఆర్ మేనేజర్ కె.శివప్రసాద్, ప్రదానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

తాళ్లరేవు, సెప్టెంబరు 11: విజయవాడ వరద బాధితుల సహాయార్థం గోవలంక సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ ఆధ్వర్యంలో టీడీపీ నేతలు రూ.15వేలను విరాళంగా ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు మరమళ్ల టీడీపీ కార్యాలయంలో అందించారు. టీడీపీ నేతలు బోయిడి వేణుగోపాల్, మోర్త ఉమామహేశ్వరరావు, కోరుకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

గండేపల్లి, సెప్టెంబరు 11: సూరంపాలెంలోనిఆదిత్య యూనివర్శిటీ యూత్ రెడ్‌క్రాస్ యూనిట్‌తో రక్తదాన శిబిరం నిర్వహించినట్టు యూత్ రెడ్ క్రాస్ యూనిట్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ మిస్టర్ పి.శివకుమార్ తెలిపారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు కోసం 307మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఆదిత్య డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డీన్ డాక్టర్ ఎంవి రాజేష్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

గణపతికి పూజలు

పోర్టుసిటీ (కాకినాడ), సెప్టెంబరు 11: నగరంలోని సంపత్ విజయ గణపతి దేవాలయంలో నిర్వహించిన పూజల్లో దేవదాయ, ధర్మదాయ శాఖ ఈవోలు పాల్గొన్నారు.

కాకినాడలో అగ్నిప్రమాదం

కాకినాడ క్రైం, సెప్టెంబరు 11: కాకినాడ డైరీఫాం సెంటర్‌లోని రాజీవ్‌గృహకల్పలో బుధవారం అగ్నిప్రమాదం జరిగి రూ.2లక్షల మేర ఆస్తినష్టం సంభవించింది. రాజీవ్‌గృహకల్ప 5వ వీధిలోని మొదటి అంతస్తులో సుంకర చంద్రకళ కుటుంబం నివాసం ఉంటోంది. ఇంట్లో బుధవారం ఉదయం దీపారాధన చేసి ఆ కుందులను దేవుడి వద్ద పెట్టారు. వంట చేసే క్రమంలో కుక్కరు పేలి ఆ మూత వెలుగుతున్న కుందులపై పడడంతో మంటలు చెలరేగి దావాణంలా వ్యాపించి ఇంట్లోని సామాగ్రి ఆహుతైంది. సాలీపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు సిబ్బంది, అగ్నిమాపకశకటంతో ఘటనాస్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. చంద్రకళ కుటుంబం స్వల్ప గాయాలతో బయటపడింది. ఆస్తినష్టం రూ.2లక్షలు ఉంటుందని ఏడీఎఫ్‌వో తెలిపారు.

వరద బాధితులకు ఆహారం పంపిణీ

కాకినాడ సిటీ, సెప్టెంబరు 11: ఏలేరు వరద కారణంగా ముంపునకు గురైన కిర్లంపూడి మండలం రాజుపాలెం బాధితులకు సానా సతీష్‌బాబు ఫౌండేషన్ తరఫున సహాయ సహకారాలు అందించారు. ఈ మేరకు ఫౌండేషన్ సభ్యులు బుధవారం వరద బాధితులకు ఆహారం, తాగునీరు పంపిణీ చేశారు. తొలుత కాకినాడలోని ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఆహారం పొట్లాలు తయారు చేయించి ట్రాక్టర్ మీద రాజుపాలెనికి తరలించారు. 3వేలమంది వరద బాధితులకు ఫుడ్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, క్యాండిళ్లు పంపిణీ చేశారు. టీడీపీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిశీలకుడు, ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సానా సతీష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే పంతం నానాజీ పుట్టినరోజు వేడుకలు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 11 : కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పుట్టినరోజు సందర్భంగా బుధవారం పంతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 2 లక్షలు విలువైన బియ్యం, నిత్యవసర సరుకులను 100 మంది ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు ఎంపీడీవో కర్రె స్వప్నతో కలసి పంపిణీ చేశారు. దివ్యాంగునికి ట్రైసైకిలుని ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పంతం సందీప్, నందిపాటి త్రిమూర్తులు, టి రామకృష్ణ, రాందేవు సీతయ్యదొర, బోళ్ల కృష్ణమోహన్,, శిరంగు శ్రీనివాసరావు, పితాని అప్పన్న, ఎం నాగబాబు, శాండీ, గేదెల చిన్నారావు, మడికి బాబూరావు, బన్ను పాల్గొన్నారు. ఎమ్మెల్యే పంతం నానాజీకిపార్టీ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తరలివచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు నురుకుర్తి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ఏసుదాసు పాల్గొన్నారు. నానాజీ పుట్టినరోజు పురస్కరించుకుని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు ఆర్థిక సహకారంతో రమణయ్యపేట బోట్‌క్లబ్ అన్న క్యాంటీన్‌లో 600 మందికి అన్నదానం నిర్వహించారు.

కరప: నడకుదురు జనావళి వృద్ధుల అనాధాశ్రమంలో కూరాడ గ్రామానికి చెందిన జనసైనికులు కేక్ కట్‌చేసి వృద్ధులకు పంచిపెట్టారు. వారికి అన్నదానం చేశారు. కాకినాడ రెడ్‌క్రాస్ అంధుల పాఠశాలలో విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు బండారు మురళి, బోగిరెడ్డి కొండబాబు, బోగిరెడ్డి గంగాధరరావు, వెలుగుబంట్ల సూరిబాబు, టేకుమూడి సాయిరామ్, చోడిశెట్టి ప్రసాద్, గంటా నానిబాబు, ముద్రగడ రమేష్, వి.కృష్ణ పాల్గొన్నారు.

భయం గుప్పెట్లో టౌన్ ప్లానింగ్ సిబ్బంది!

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 11: కాకినాడ నగరపాలక సంస్థ నూతన బిల్డింగ్ నిర్మాణ దశలో ఉండడంతో కార్పొరేషన్‌లోని సెక్షన్లను వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా రామారావుపేట శివాలయం వెనుక గల భవనాల్లో టౌన్‌ప్లానింగ్, హెల్త్ సెక్షన్లు ఏర్పాటు చేశారు. 30ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఏర్పాటు చేసిన టీమ్ శ్లాబులు ఊడి పడుతున్నాయి. ఇప్పటికే 3సార్లు సిబ్బంది పనిచేస్తున్న చోట ఎవరూ లేని సమయంలో శ్లాబు పడడంతో పలుమార్లు ప్రమాదం తప్పింది. ఎన్నిసార్లు స్లాబు పడిన ఇంజనీరింగ్ అధికారులు తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతున్నారు. దీంతో స్లాబు పెచ్చులు పడుతూనే ఉన్నాయి. దీంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది భయం గుప్పెట్లో దినదిన గండంగా పనిచేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.